
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కరీంనగర్
జిల్లా వార్తలు

బుధవారం 8 జనవరి 2025

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు


విద్యుత్ దీపాల వెలుగులో
మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయం

కరీంనగర్ కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి పర్వదినం ఈ నెల 10న జరగనుంది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని పలు ఆలయాల్లో అర్చకులు, అధికారులు, నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక క్యూలైన్లు, ప్రసాద కౌంటర్లు, తాగు నీరు, పూజల కోసం సన్నాహాలు జరుగుతున్నాయి. వివిధ ఆలయాల్లో సుందరంగా అలంకరించిన స్వామివార్ల రూపాలను ఉత్తర ద్వారం గుండా భక్తులు దర్శించకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ దీపాలు, పలు రకాల పూలు, శ్రీవారి అలంకరణల ప్రక్రియలు ప్రారంభమయ్యాయి. మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శేషవాహనంపై, మంకమ్మతోట వేంకటేశ్వరాలయంలో బృందావనంలో రాధాకృష్ణులుగా, విద్యానగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తప్రాకారాలతో కూడిన పరమపదనాథుడిగా స్వామివారు దర్శనమివ్వనున్నారు. జ్యోతినగర్ వేంకటేశ్వరాలయంలో వైకుంఠనాథుడు, కట్టరాంపూర్ గోదా లక్ష్మీ సమేత వేంకటేశ్వరాలయంలో పరమపదనాథుడు, యజ్ఞవరాహక్షేత్రంలో కృష్ణలీలా ఘట్టం, సప్తగిరికాలనీ కోదండ రామాలయంలో రంగనాథస్వామి, వావిలాలపల్లి సీతారామచంద్రస్వామి ఆలయంలో పాలకడలిపై లక్ష్మీనారాయణుల రూపంలో స్వామివారు కనిపించనున్నారు. కమాన్‌రోడ్ రామేశ్వరాలయంలో ఏడు ద్వారాలు ఏర్పాటు చేసి స్వామి దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

సంక్రాంతికి అందని రేషన్ బియ్యం



- సమస్యలు పరిష్కరించాలని హమాలీల సమ్మె

- హమాలీల సమ్మెతో నిలిచిన రవాణా
- ముందుగా డీడీలు కట్టిన డీలర్లకే సరఫరా
- సగం షాపుల్లో నిలిచిన పంపిణీ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

మరో వారం రోజుల్లో సంక్రాంతి పండుగ.. పది రోజుల ముందే ప్రతి ఇంట్లో చకినాలు, అరిసెలు, గారెలు చేసుకొని తింటూ కుటుంబ సభ్యులంతా ఆనందోత్సహాల మధ్య పండు గను జరుపుకోవడం ఆనవాయితీ. ఈ పిండి వంటలు చేసుకోవడానికి బియ్యం పిండే ప్రధాన వనరు. ఇప్పుడు ఆ బియ్యం అందక గ్రామీణ ప్రాంతాల్లో సగం మంది పిండి వంటలు చేసుకునేందుకు ఇబ్బందులు పడు తున్నారు. ఈ జనవరి మాసంలో రేషన్ బియ్యం అందలేదు. పౌరసరఫరాల శాఖలో పనిచేసే హమాలీలు జనవరి 1 నుంచి సమ్మె కు దిగడంతో బియ్యం బస్తాలు ఎత్తేవారు, దించేవారు లేక ప్రజాపంపిణీ వ్యవస్థ డీలర్లకు రవాణా నిలిచి పోయింది. పైసా అవ సరం లేకుండా బియ్యం లభ్యమయ్యే పరిస్థితి నుంచి కిలోకు 50 రూపాయల వరకు వెచ్చించి బియ్యం కొనుక్కొని పిండివంటలు చేసుకోవలసిన పరిస్థితి రావడంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు.


● జిల్లాలో 2,61,164 ఆహారభద్రత కార్డులు

జిల్లాలో ఆహారభద్రత కార్డులు పొందిన కుటుంబాలు 2,61,164 ఉండగా ఈ కార్డుల్లో 7,64,122 మంది సభ్యులుగా నమోదయ్యారు. వీరందరికి ఒక్కొక్క సభ్యుడికి ఆరు కిలోల చొప్పున ప్రతి నెలా 45,847 క్వింటాళ్ల బియ్యం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్నారు. అంత్యోదయ ఆహార భద్రతా కార్డుల ద్వారా 41,034 మందికి ఒక్కో కుటుంబానికి 35 కిలోల చొప్పున 5,505.50 క్వింటాళ్లు, అన్నపూర్ణ కార్డుల ద్వారా 35 కుటుంబాలకు కుటుంబానికి 10 కిలోల చొప్పున 3.5 క్వింటాళ్ల బియ్యం సరఫరా అవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 566 రేషన్ షాపుల ద్వారా ఈ మూడు పథకాల కింద 51,356 క్వింటాళ్ల బియ్యం నెలనెలా సరఫరా చేస్తున్నారు.

రేషన్‌షాపుల డీలర్లు ముందస్తుగా డీడీల ద్వారా డబ్బు చెల్లిస్తే సివిల్ సప్లయిస్ శాఖ వారికి బియ్యం సరఫరా చేస్తుంది. జనవరి మాసానికి సగం మంది డీలర్లకు మాత్రమే బియ్యం సరఫరా అయింది. హమాలీలు జనవరి 1 నుంచి సమ్మెకు దిగగా సరఫరా నిలిచిపోయింది. దీంతో పండుగకు బియ్యం పంపిణీ జరగలేదు. పౌరసరఫరాల శాఖకు అనుబంధంగా జిల్లాలో సుమారు 300 మంది హమాలీలు, కూలీలు పని చేస్తు న్నారు. వీరి ద్వారానే బియ్యం రవాణా జరుగుతున్నది. బియ్యం బస్తాలను ఎత్తిదించే చార్జీలుగా క్వింటాల్‌కు 26 రూపాయలు పొందేవారు. ఆ డబ్బు సరిపోవడం లేదని వారు చేసిన ఆందోళన కారణంగా పౌరసరఫరాలశాఖ అద నంగా మరో మూడు రూపాయలు పెంచడానికి అంగీకరించింది. వారికి ప్రభుత్వం సమకూర్చే దుస్తుల టైలరింగ్ చార్జీలను 1200 నుంచి 1500 రూపాయలకు, దీపావళి పండుగకు స్వీట్లకు గాను ఇచ్చే 1500 రూపాయలను 1800 రూపాయలకు, బోనస్‌ను 1800 నుంచి 2000 రూపాయలకు పెంచేందుకు అక్టోబరు

మిగతా 8వ పేజీలో...

● పోలీసుల పహారాలో బియ్యం సరఫరా


సివిల్ సప్లయిస్ గోదాం వద్ద పోలీసుల బందోబస్తు

సుభాష్‌నగర్ (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయిస్ శాఖకు అనుబంధంగా పని చేస్తున్న హమాలీలు సమ్మె చేస్తుండడంతో సంక్రాంతి పండగ వస్తున్నందున ప్రజలు ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంఎల్‌సీ పాయింట్ నుంచి పోలీసు పహారా మధ్యఒడిశాకు చెందిన కూలీలతో బియ్యం బస్తాలను లోడింగ్ చేయించారు. సోమవారమే కూలీలను తీసుకువచ్చి లోడింగ్ చేయించాలని అధికారులు ప్రయత్నించారు. హమాలీలు అడ్డుకోవడంతో వారు వెనుదిరిగారు. మంగళవారం పోలీసు పహారా మధ్య బియ్యం బస్తాలను లోడ్ చేయించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు కొయ్యడ సృజన్ మాట్లాడుతూ ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందానికి సంబంధించిన జీవో వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


కోర్టు చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

భగత్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ శ్రేణులు బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి చేయడాన్ని నిరసిస్తూ నగరంలోని కోర్టు చౌరస్తాలో ఆ పార్టీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ శ్రేణుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీజేపీ కార్యాల యంపై జరిగిన దాడిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దాడుల సంస్కృతి సమంజసం కాదని, చట్ట వ్యతిరేక పనులను కాగ్రెస్ ప్రోత్సహించడం మూర్ఖత్వమన్నారు. ఎవరైనా తప్పుడు వ్యాఖ్యలు చేస్తే ప్రజాస్వామ్య బద్ధంగా ఖండించాలన్నారు. రాష్ట్రంలో అధికారం చేతిలో ఉందని చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని భయబ్రా ంతులకు గురి చేయడం శోచనీయమన్నారు. దాడికి పాల్పడ్డ కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం

గణేశ్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ కిసాన్‌సెల్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఇందిరా చౌక్ వద్ద మంగళవారం సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతు బంధు పేరిట గుట్టలకు, కొండలకు బీడు భూములకు రైతుబంధు ఇచ్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. ఇప్పడు ఆ విధంగా జరగకూడదనే ఉద్దేశంతో నిజమైన అన్నదాతలకు రైతు భరోసా అందిస్తా మన్నారు. జనవరి 26 నుంచి 12 వేల రూపాయల రైతు భరోసా, భూమిలేని రైతు కూలీలకు 12 వేలు ఆర్థిక సహాయాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో సుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, నాయకులు ఎండీ తాజ్, పులి ఆంజనేయులుగౌడ్, కర్ర సత్యప్రసన్నారెడ్డి పాల్గొన్నారు.


స్వీట్స్ తినిపించుకుంటున్న డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు

డీసీసీ కార్యాలయం వద్ద బందోబస్తు


డీసీసీ కార్యాలయం వద్ద పోలీస్ బందోబస్తు

కరీంనగర్ క్రైం, జన వరి7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మంగళ వారం పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంపై యువజన కాంగ్రెస్ కార్యకర్తలు దాడి ఘట నను నిరసిస్తూ ఏవైనా సంఘట నలు జరిగే అవకాశం ఉందన్న అనుమానంతో డీసీసీ కార్యాలయానికి కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా, ఎలాంటి ఘటనలు జరుగకుండా ముందస్తు చర్యగా డీసీసీ కార్యాలయం వద్ద పోలీసులను మోహరించారు. మరో వైపున బీజేపీ కార్యకర్తలు డీసీసీ కార్యాలయం వైపు వెళ్లకుండా కట్టడి చేశారు.

ఓపెన్ స్కూల్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

కరీంనగర్ టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ ఎస్సెస్సీ ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి 22వ తేదీలోగా ఎస్సెస్సీ విద్యార్థులు ప్రతి సబ్జెక్టుకు వంద రూపాయల చొప్పున, ఇంటర్ విద్యార్థులు ప్రతి సబ్జెక్టుకు 150 రూపాయల చొప్పున ఫీజు చెల్లించాలన్నారు. 23 నుంచి 29 వరకు 25 రూపాయల అదనపు రుసుముతో, 30 నుంచి ఫిబ్రవరి 3 వరకు 50 రూపాయల అదనపు రుసుముతో ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. ఫిబ్రవరి 4 నుంచి 6 వరకుఎస్సెస్సీ విద్యార్థులు 500 తత్కాల్ రుసుముతో, ఇంటర్మీడియట్ విద్యార్థులు వెయ్యి రూపాయలు అదనంగా చెల్లించవచ్చని తెలిపారు.


కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

జ్యోతిబాపూలే గురుకులంలో ఫుడ్ పాయిజన్

- 28 మంది విద్యార్థినులకు అస్వస్థత
- విచారణకు ఆదేశించిన అదనపు కలెక్టర్

గణేశ్‌నగర్, ఆంధ్రజ్యోతి

6

మిర్చి రైతు విలవిల

- రోజు రోజుకు ధర తగ్గుతుండడంతో ఆందోళన

హుజూరాబాద్, ఆంధ్రజ్యోతి

6

చేపల మార్కెట్ లేక ఇబ్బందులు

- రాజీవ్ రహదారికి ఇరువైపులా విక్రయం
- వాహనాలు రోడ్డుపై నిలుపుతుండడంతో ప్రమాదాలు

తిమ్మాపూర్, ఆంధ్రజ్యోతి

7

వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి సారించాలి

గంగాధర, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ రంగాల వైపు రైతులు దృష్టి సారించాలని డీఆర్డీవో పీడీ శ్రీధర్ అన్నారు. మంగళవారం మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీలో భాగంగా చేపడుతున్న పలు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాలైన పాడి పశువులు, గొర్రె, మేకలు, కోళ్ల పెంపకం చేపడితే మరింత లాభాలు పొందవచ్చన్నారు. ఉపాధి హామీలో చేపడుతున్న పనులతో రైతులకు, కూలీలకు ఉపాధి లభిస్తుందన్నారు. పనులు నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి పనిని పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాము, ఏపీఎం పవన్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



'హుజూరాబాద్'లో మూడు గ్రామాల విలీనం..?

- రంగాపూర్, రాంపూర్, పెద్దపాపయ్యపల్లె గ్రామాలను కలిపేందుకు రంగం సిద్ధం
- నివేదిక కోరిన రాష్ట్ర పట్టణ ప్రణాళిక కార్యాలయం

హుజూరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపాలిటీలో మూడు గ్రామాలను విలీనం చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. రెండ్రోజుల క్రితం రాష్ట్ర పట్టణ ప్రణాళిక కార్యాలయం నుంచి అధికారులు నివేదిక కోరినట్లు సమాచారం. ఇందుకోసం మున్సిపల్ అధికారులు సమయత్తమవుతున్నారు. గతంలో హుజూరాబాద్ పురపాలక సంఘం ఉండేది. పదేళ్ల క్రితం అప్పటి మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్ హుజూరాబాద్‌ను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్‌గా చేశారు. మళ్లీ 2019లో హుజూరాబాద్ పట్టణాన్ని అనుకుని ఉన్న బోర్నపల్లి, కొత్తపల్లి, ఇప్పల్‌నర్సింగాపూర్, దమ్మక్కపేట గ్రామాలను మున్సిపాలిటీలో కలిపారు. దీంతో హుజూరాబాద్ మున్సిపాలిటీలో 30 వార్డులు అయ్యాయి. హుజూరాబాద్ మున్సిపాలిటీలో పక్కనే ఉన్న పెద్దపాపయ్యపల్లె, రంగాపూర్, రాంపూర్ గ్రామాలను కూడా కలిపితే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. హుజూరాబా ద్‌కు ఈ మూడు గ్రామాలు మూడు కిలో మీటర్ల దూరంలోనే ఉంటా యి. ఇప్పటికే హుజూరాబాద్ పట్టణం ఈ గ్రామాల సమీపం వరకు విస్తరించింది.

● ఏడు వార్డులు పెరిగే అవకాశం

రాంపూర్‌లో 2700మంది ఓటర్లు ఉండగా, గ్రామ జనాభా 5వేలు, రంగాపూర్‌లో 1510మంది ఓటర్లు ఉండగా, జనాభా 2200, పెద్దపాపయ్యపల్లిలో 2800మంది ఓటర్లు ఉండగా, 4500 జనాభా ఉంది. ఈ మూడు గ్రామాలను విలీనం చేస్తే హుజూరాబాద్ మున్సిపాలిటీలో మరో ఏడు వార్డులు పెరిగే అవకాశాలున్నాయి. పది రోజుల క్రితం ఈ మూడు గ్రామాలకు చెందిన ముఖ్యమైన నాయకులు కలి హుజూరాబాద్ మున్సిపాలిటీలో గ్రామాలను విలీనం చేయవద్దని తీర్మానం చేసుకున్నట్లు తెలిసింది. ఇప్పటికే హుజూరాబాద్ పట్టణ జనాభా 50వేల వరకు ఉండగా, ఈ మూడు గ్రామాలు విలీనమైతే 12 వేల జనాభా పట్టణంలో కలుస్తుంది. ఈ మూడు గ్రామాలను అనుకొని నేషనల్ హైవే-563 బైపాస్ రోడ్డు వెళ్తుండడంతో పట్టణ విస్తీర్ణం మరింత పెరగనుంది. ఇందు కోసం మున్సిపల్ అధికారులు ఆ దిశలో ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యను వివరణ కోరగా విలీన గ్రామాల కోసం రాష్ట్ర మున్సిపల్ ఉన్నతాధికారులు నివేదిక కోరిందన్నారు. పట్టణానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న గ్రామాల పేర్లను ఇవ్వాలని అడిగినట్లు తెలిపారు.

నేత కార్మికుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌కు చెందిన గోవిందు రాజు(43) అనే నేత కార్మికుడు మంగళ వారం క్షణికావేశంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌కు చెందిన గోవిందు రాజు ఏడాది క్రితం వరకు పవర్‌లూం కార్మికుడిగా పని చేసేవాడు. ప్రస్తుతం కూలీ పనులకు వెళ్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. తరచూ డబ్బులు ఇవ్వాలంటూ భార్యను వేధించడంతో గొడవలు తలెత్తాయి. రోజులాగే బయటకు వెళ్లిన రాజు మద్యం తాగి వచ్చి భార్యను, కుటుంబ సభ్యులను ఇంట్లో నుంచి బయటకు పంపించాడు. తలుపులు వేసుకొని క్షణికావేశంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. గోవిందు రాజు భార్య సుజాత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

కత్తిపోట్లకు గురైన వ్యక్తి మృతి

కోల్‌సిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గత నెల 31న కత్తిపోట్లకు గురైన నంది శ్రీనివాస్(37) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో శ్రీనివాస్ మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. శ్రీనివాస్ మేనకోడలి భర్త అయిన గొల్ల శ్రావణ్ జూనియర్ కళాశాల మైదానానికి మాట్లాడుదామని శ్రీనివాస్‌ను తీసుకెళ్లి హత్యాయత్నంకు పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. నిందితుడు గొల్ల శ్రావణ్‌ను పోలీసులు ఘటన జరిగిన రోజే అరెస్టు చేశారు. శ్రీనివాసే తన భార్యను దూరం చేస్తున్నాడని కక్ష పెంచుకుని ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. మంచిర్యాల జిల్లా భీమారం మండల కేంద్రానికి చెందిన గొల్ల శ్రావణ్ ఆరు సంవత్సరాల క్రితం గోదావరిఖని వినోభానగర్‌కు చెందిన కాళ్ల పూజను ప్రేమ వివాహం చేసుకోగా, వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు.

సుల్తానాబాద్ కేంద్రంగా

బియ్యం అక్రమ రవాణా

- రేషన్ షాపుల వద్దే బహిరంగంగా కొనుగోళ్లు
- లారీల కొద్దీ పట్టుబడుతున్న వైనం
- నామమాత్రపు కేసులతో సరిపెడుతున్న అధికారులు

సుల్తానాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. సుల్తానాబాద్ కేంద్రంగా ఇటు కరీంనగర్, అటు మహారాష్ట్రకు జోరుగా అక్రమ రవాణా సాగుతోంది. సుల్తానాబాద్‌తో పాటు సమీప గ్రామాలు, మండలాలు నుంచి బియ్యాన్ని సేకరించి మండలంలో నిల్వచేస్తున్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని ఓ కాలనీకి చెందిన పలు కుటుంబాల వారు రేషన్ బియ్యం సేకరణ, అక్రమ నిలువ, అక్రమ తరలింపును వృత్తిగా చేసుకున్నారు. చాలామంది ఆటోలు, ఇతర వాహనాల ద్వారా సుల్తానాబాద్‌తో పాటు సమీప మండలాల్లో తిరుగుతూ సబ్సిడీ బియ్యాన్ని కొంటున్నారు. ప్రతీ నెలా బియ్యం ఇచ్చే రోజుల్లో రేషన్ షాపుల వద్ద వీరు లబ్ధిదారులు నుంచి కొంటున్నారు. కిలోకు 15 లేదా 14 రూపాయల చొప్పున లబ్ధిదారులకు చెల్లిస్తున్నారు. ఈ బియ్యాన్ని పెద్ద మొత్తంలో ఇక్కడ నుంచి తరలించి మహారాష్ట్రలో కిలో 25 నుంచి 30 రూపాయలకు అమ్ముకుంటున్నారు. సుల్తానాబాద్‌తో పాటు కొదురుపాక, దేవునిపల్లి, గొల్లపల్లి, కదంబాపూర్, బొంతకుంటపల్లిల్లో తదితర గ్రామాల్లో రేషన్ బియ్యం అక్రమ నిల్వ కేంద్రాలు అధికంగా ఉన్నాయని సమాచారం. గతంలో అనేక సార్లు అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యంను అధికారులు పట్టుకున్నారు. సుల్తానాబాద్‌లోని రైస్ మిల్లుల ప్రాంతంలో కొందరు మిల్లర్లు సైతం ఈ దందాలో భాగస్వాములుగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



సుల్తానాబాద్‌లో పట్టుబడిన రేషన్ బియ్యం (ఫైల్)

● మహారాష్ట్రకు తరలింపు..

సుల్తానాబాద్ తదితర ప్రాంతాల నుంచి సేకరించిన సబ్సిడీ బియ్యాన్ని లారీలు, వ్యాన్ల ద్వారా కరీంనగర్ వంటి పట్టణాలకు తరలిస్తున్నారు. మరికొందరు పెద్దపల్లి మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. ఒక్కో లారీ లోడ్ బియ్యానిన అక్రమంగా తరలించి విక్రయించడం ద్వారా లక్షా ఇరవై వేల నుంచి రెండు లక్షల రూపాయల వరకు ఆర్జిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



ఐతరాజ్‌పల్లి వద్ద సబ్సిడీ బియ్యాన్ని పట్టుకున్న సివిల్ సప్లై అధికారులు(ఫైల్)

● దళారులు సమాచారం ఇస్తేనే...

చాలా కాలంగా సుల్తానాబాద్ కేంద్రంగా పీడీఎస్ బియ్యం అక్రమ రవణా జోరుగా సాగుతోంది. బహిరంగంగా రేషన్ బియ్యాన్ని సేకరించడం, రాజీవ్ రహదారికి ఇరుపక్కల, మార్కండేయ కాలనీ, సుద్దాల గొల్లపల్లి రోడ్డు ప్రాంతాల్లో నిల్వ చేయడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బియ్యం అక్రమ రవాణా సమాచారాన్ని అధికారులకు, విలేకరులకు చేర వేస్తున్నారనే కారణంగా అనేక గొడవలు జరిగాయి. కొన్ని సందర్భాల్లో దళారుల మధ్య వ్యాపారంలో మనస్పర్థలు వచ్చిన సందర్భంలో బియ్యం అక్రమ రవాణా, నిలువ సమాచారాన్ని జిల్లా ఉన్నతాధికారులకు అందించేవారు. దాంతో అధికారులు తనిఖీలు చేసి కేసు నమోదు చేసేవారు. అయితే అడపాదడపా తనిఖీలు చేసి, మొక్కుబడిగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కల్వర్టులను తనిఖీ చేసిన బాంబు స్క్వాడ్

చందుర్తి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మర్రిగడ్డ గ్రామం నుండి లింగంపేట అటవీ ప్రాంతంలో ప్రధాన రహదారిలో బాంబుస్కాడ్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా మంగళవారం తనిఖీలు చేశారు. ముఖ్యంగా కల్వర్టులను, రోడ్లను అణువణువు తనిఖీ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో బాంబుస్కాడ్ తనిఖీలతో ఏమి జరిగిందో తెలియక గ్రామాల్లో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో లింగంపేట అటవీ ప్రాంతంలో వేములవాడ కోరుట్ల ప్రధాన రహదారిపై మావోయిస్టు నక్సల్స్ పేల్చిన మందు పాతరలో, అప్పటి చందుర్తి ఎస్ఐ దుర్మరణం చెందాగా పలువురు పోలీసులు గాయపడ్డారు. మళ్లీ ఈ ప్రాంతంలో బాంబు స్క్వాడ్ తనిఖీలు జరుగుతుండడంతో ప్రజల్లో నెలకొంది. వీఐపీల భద్రతలో భాగంగా కల్వర్టులను తనిఖీలు చేపట్టినట్లు పోలీసు పేర్కొన్నారు.

భార్యాభర్తల మధ్య ముదిరిన గొడవ

● ఒకరిపై ఒకరు దాడి ● భర్త మృతి, భార్య పరిస్థితి విషమం

వేములవాడ టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో తరచూ గొడవకు దిగుతున్న భర్తను భార్య మందలించడంతో గొడవ తలెత్తి ఒకిపైఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో భర్త మృతి చెందగా భార్య పరిస్థితి విషమంగా మారింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం చీర్లవంచ గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వేములవాడ మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన రౌతు మహిపాల్ (47), సుజాత కూలీ పని చేసుకుంటూ పిల్లలను పోషించుకుంటున్నారు. మహిపాల్ మద్యానికి అలవాటు పడ్డాడు. మద్యం తాగి వస్తుండడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం భార్యాభర్తల మధ్య గొడవ తలెత్తి ఇద్దరూ ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. స్కూల్ నుంచి పిల్లలు ఇంటికి తిరిగివచ్చి చూసేసరికి ఇద్దరూ అపస్మారక స్థితిలో రక్తపు మడుగులో పడి ఉన్నారు. వెంటనే స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించేలోపు మహిపాల్ మృతి చెందాడు. భార్య సుజాతకు తీవ్రగాయాలవడంతో వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి పట్టివేత

గొల్లపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం లొత్తునూర్ గ్రామంలో జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన సుద్దాల సాయికుమార్ (26) అనే యువకుడు గంజాయి తరలిస్తుండగా ఎస్సై చిర్ర సతీష్ కుమార్ మంగళవారం పట్టుకున్నారు. గ్రామంలో గంజాయిని విక్రయిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో కలిసి గ్రామంలో మాటు వేశారు. ఈ క్రమంలో సాయికుమార్ తన ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తూ పోలీసులకు పట్టుబడగా అతడి వద్ద 270 గ్రాముల గంజాయి లభ్యమైంది. దీంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. యువకుడిని అదుపులోకి తీసుకున్నందుకు పోలీసు ఉన్నతాధికారులు ఎస్సై చిర్ర సతీష్ కుమార్‌ను, పోలీసు సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వేణు, తిరుపతి, పూర్ణసాయి, రాజమౌళి, మహేష్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భూ ఆక్రమణల్లో సింగిల్ విండో చైర్మన్ అరెస్టు

తంగళ్లపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అసైన్డ్ భూమి అక్రమంగా పట్టా చేసుకున్న నేరేళ్ల సింగిల్ విండో చైర్మన్ కోడూరి భాస్కర్‌గౌడ్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని సర్వే నెంబర్ 365ఇ/1 లో 20 గుంటల స్థలాన్ని అక్రమంగా పట్టా చేసుకోవడానికి సహకరించిన రెవెన్యూ అధికారులపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా అసైన్డ్ భూమి అక్రమంగా పట్టా చేసుకున్న మరికొంత మందిపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిసింది. పలువురు బీఆర్ఎస్ నాయకుల ఇండ్లపై దాడులు నిర్వహించినట్లు సమాచారం. పోలీసులు అరెస్ట్ చేస్తారనే సమాచారంతోనే కొందరు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది.

ముంబాయిలో దుమాలవాసి మృతి



రాజు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జనవరి7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాలకు చెందిన కానపురం రాజు (42) ముంబాయిలో భవన నిర్మాణ పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం.. దుమాలకు చెందిన రాజు ఉపాధి నిమిత్తం భార్యాపిల్లలతో కలిసి 15 ఏళ్ల కిందట ముంబాయికి వలస వెళ్లా డు. అక్కడ భవన నిర్మాణ కార్మికుడుగా పని చేస్తున్నాడు. భవనంపై పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడి చనిపోయాడు. మృతుడికి భార్య ఉష, కొడుకు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వచ్చేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక భార్యాపిల్లలు దిక్కులు చూడాల్సి వస్తోందని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. దాతలు మానవత దృక్పథంతో స్పందించి సాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి



భీమయ్య (ఫైల్)

చిగురుమామిడి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేకొండలో మంగళవారం ఇదే గ్రామానికి చెందిన గంద్రతి భీమయ్య(55) అనే రైతు ట్రాక్టరు బోల్తా పడి మృతి చెందాడు. సంఘటనకు సంబంధించిన వివారాలు ఇలా ఉన్నాయి... భీమయ్య తన వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టరు డబ్బాను తీసుకుని గ్రామ పరిధిలోని బండారుపల్లికి చేందిన వెంకటయ్య అనే రైతుకు అప్పగించి ట్రాక్టరు ఇంజన్‌తో తిరిగి వస్తున్నాడు. రాయిని చెరువు వద్ద ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో భీమయ్యకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై బండి రాజేశ్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు , కుమారుడు ఉన్నారు. మృతుడు మున్నూరు కాపు అధ్యక్షుడిగా , సీపీఐ గ్రామ అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. భీమయ్య మృతి పట్ల సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంటకరెడ్డి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీచైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, బోయిన అశోక్, చాడ శ్రీధర్‌రెడ్డి సంతాపం తెలిపారు.

జ్యోతిబాపూలే గురుకులంలో ఫుడ్ పాయిజన్

●28 మంది విద్యార్థినులకు అస్వస్థత ● విచారణకు ఆదేశించిన అదనపు కలెక్టర్

గణేశ్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో సోమవారం రాత్రి ఫుడ్ పాయిజన్‌తో 28నుంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో బాధ పడ్డారు. దీంతో వసతిగృహ అధికారి, సిబ్బంది వారిని సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అస్వస్థతకు గురైన వారిని పరిశీలించిన వైద్యులు ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏమైందోనంటూ బోరున విలపించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. చికిత్స అనంతరం కోలుకున్న విద్యార్థినులకు హాస్టల్‌కు పంపించారు. అస్వస్థతకు గురైన వారికి సెలవులు ఇచ్చి, ఇళ్లకు పంపించారు. మెనూ ప్రకారం సోమవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో బబ్బెర్లు ఉడికించి స్నాక్స్‌గా అం దించారు. అనంతరం రాత్రి భోజనంలో క్యాలీఫ్లవర్ కూరతో పాటు సాంబర్ అందించారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు మొదలైనట్లు బాధిత విద్యార్థులు తెలిపారు. విద్యార్థులకు సాయంత్రం పూట అందించిన స్నాక్స్, భోజనం కొంతమందికి పడకపోవటంతోనే ఫుడ్ పాయిజన్ అయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. గురుకులంలో 411మంది విద్యార్థులు ఉన్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

● ఆహార పదార్థాలను తనిఖీ చేసిన అధికారులు

అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, ఆర్డీవో, బీసీడీవో, డీఎంహెచ్‌వో, ఆహార తనిఖీ అధికారులు గురుకుల హాస్టల్‌కు చేరుకుని ఆహార పదార్థాలు తనిఖీ చేశారు. శాంపిళ్లు సేకరించి, పరీక్షల కోసం తమ వెంట తీసుకెళ్లారు. సోమవారం రాత్రి వండిన క్యాలీఫ్లవర్స్ నాలుగు రోజుల క్రితం వచ్చాయని తెలిసింది.



ఆవేదన వ్యక్తం చేస్తున్న తల్లి

● విద్యార్థి సంఘాల ఆందోళన

ఫుడ్ పాయిజన్ విషయం తెలుసుకున్న పలు విద్యార్థి సంఘాలు, బీసీ సంఘాలతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. రెండో పట్టణ సీఐ సృజన్‌రెడ్డి అక్కడికి చేరుకొని నచ్చజెప్పారు. గురుకులాల ప్రాంతీయ సమన్వయాధికారి అంజలితో పోలీసులు వివరణ ఇప్పించారు. సంఘటనపై విచారణకు ఆదేశించినట్లు అదనపు కలెక్టర్ ప్రపుల్‌దేశాయ్ వివరణ ఇచ్చారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



విద్యార్థి నాయకులతో మాట్లాడుతున్న అధికారులు

కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరా

భగత్‌నగర్: కరీంనగర్‌లోని జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయంలో జరిగిన ఫుడ్ పాయిజన్‌పై కేంద్ర హోం శాఖసహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ ఆరా తీశారు. ఢిల్లీ నుంచి కలెక్టర్ పమేలాసత్పతితో ఫోన్‌లో మాట్లాడారు. క్యాబేజీ తినడం వల్ల విద్యార్థులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారని కలెక్టర్ వివరించారు. ప్రస్తుతం విద్యార్థులంతా క్షేమంగా ఉన్నారని, ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారని కలెక్టర్ తెలిపారు.

గోదావరిఖనిలో మెడికల్ అసిస్టెంట్‌పై హత్యాయత్నం

కోల్‌సిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని రాంనగర్‌లోని కోదండ రామాలయం కాంపౌండ్‌లో గల సింగరేణి క్వార్టర్లలో మంగళవారం పరాంకుశం యశ్వంత్(36)పై గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. యశ్వంత్ భార్య ప్రతిమ సింగరేణి ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తున్నారు. సాయంత్రం 3గంటలకు ఆమె ఇంటికి వచ్చేసరికి వంట రూమ్ వద్ద భర్త యశ్వంత్ తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో అపస్మారక స్థితిలో ఉన్నాడు. అతన్ని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్ మెడికల్ అసిస్టెంట్‌గా యశ్వంత్ పనిచేస్తున్నాడు. ఇంటి వద్ద ప్రైవేట్ మెడికల్ ప్రాక్టిషనర్‌గా సేవలందిస్తున్నాడు. వీరికి ఒక బాబు ఉన్నాడు. ఇంటి వెనుకవైపు నుంచి లోనికి చొరబడ్డ దుండగులు అతన్ని వంట రూము వరకు తీసుకెళ్లినట్లు దాడి చేసినట్లు భావిస్తున్నారు. అతని తలకు, ముఖం భాగాలో తీవ్ర రక్త గాయాలున్నాయి. గోదావరిఖని ఏసీపీ రమేష్, సీఐ ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించారు. యశ్వంత్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భూమేష్ పేర్కొన్నారు.

బేకరీలో అధికారుల తనిఖీలు

కోరుట్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెంగళూర్ అయ్యంగార్ బేకరీ, కోరుట్ల మిల్క్ హౌస్‌లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. గడువు మించి తినుబండారాలు నిల్వ ఉంచినందుకు రూ. 6 వేల జరిమానా విధించారు. తినుబండారాలు గడువు లోపు మాత్రమే విక్రయించాలని, ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరిగా తీసుకోవాలని హెచ్చరించారు. సందర్భంగా సానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలె అశోక్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

వేములవాడలో ప్రైవేటు ఆస్పత్రి సీజ్

వేములవాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని చాణక్య నర్సింగ్ హోమ్‌ను అధికారులు మంగళవారం సీజ్ చేశారు. ఆస్పత్రి నిర్వహణకు అవసరమైన నిబంధనలు పాటించడం లేదని, తగిన భద్రతా ప్రమాణాలు లేవని స్థానిక అధికారులు సమర్పించిన నివేదిక మేరకు చాణక్య నర్సింగ్ హోమ్‌ను సీజ్ చేస్తున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రజిత, వేములవాడ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.రాజేశ్వర్, వేములవాడ పురపాలక సంఘం కమిషనర్ అన్వేష్ మంగళవారం సాయంత్రం ఆస్పత్రికి చేరుకొని కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వులను ఆసుపత్రి నిర్వాహకులకు అందజేశారు. ఆస్పత్రి సీజ్ చేయడానికి గల కారణాలు ఏమిటని నిర్వాహకులు అధికారులను ప్రశ్నించారు. ముందస్తు నోటీసులు జారీ చేయకుండా ఏకంగా ఆస్పత్రి సీజ్ చేయడానికి రావడం ఏమిటని నిలదీశారు. సీజ్ ఉత్తర్వులు తీసుకోవడానికి నిరాకరించారు. పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. ఆస్పత్రిని సీజ్ చేయడానికి ఒప్పుకోబోమని అడ్డుగా నిలిచారు. వాదోపవాదాల అనంతరం సీజ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల కాపీని ఆస్పత్రి గోడకు అంటించారు. ఆస్పత్రిలో ఉన్న రోగులను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రైల్వే లైన్ల మధ్య రెండు నెలల పసికందు



శిశు సంక్షేమ అధికారులకు బాలుడిని అప్పగిస్తున్న ఆర్పీఎఫ్ సీఐ

పెద్దపల్లిటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కేంద్రం సమీపంలో మంగళవారం తెల్లవారు జామున రైల్వే లైన్ల మధ్య రెండు నెలల పసికందు కనిపించింది. కూనారం రైల్వే గేటు సమీపంలో ట్రాక్‌మెన్ షబ్బీర్ పనిచేస్తుండగా రెండు రైల్వే లైన్ల మధ్యలో మగ శిశువు కనిపించడంతో రామగుండం ఆర్పీఎఫ్ సీఐ సురేష్‌గౌడ్‌కు సమాచారం ఇచ్చాడు. అక్కడికి చేరుకున్న సీఐ పసి కందును పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. సూపరింటెండెంట్ శ్రీధర్ చిన్నారికి చికిత్సను అందించారు. ఏడవడం వల్ల గ్లూకోస్ లెవల్స్ తగ్గాయని, ప్రస్తుతం బాబు ఆరోగ్యం కుదుటపడిందని తెలిపారు. శిశు సంక్షేమ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు చిన్నారిని తీసుకెళ్లి సంరక్షణ చర్యలు చేపట్టారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీ కేసులో ఏడాది జైలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నేరం రుజువు కావడంతో మహారాష్ట్రలోని పర్బణి జిల్లా ఎంఎం పహాడీ మండలం సులేమాన్‌నగర్‌కు చెందిన షేక్ ఖయ్యూం అలియాస్ రఫీక్‌బేగ్‌కు అనే యువకుడికి ఏడాది కఠిన కారాగార శిక్షతోపాటు రూ.200 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సృజన తీర్పు వెల్లడించారని ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని గొల్లపల్లిలోని పిల్లి రణధీర్ 8 అక్టోబరు 2023న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల వద్దకు వెళ్లారు. తాళం పగుల కొట్టి ఇంట్లోని రూ2లక్షల నగదు, తులం బంగారు ఆభరణాలు దొంగ లు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో ఎస్సై రమాకాంత్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం మహారాష్ట్రలోని షేక్ ఖయ్యూం అలియాస్ రఫీక్‌బేగ్‌ను రిమాండ్‌కు తరలించారు.

మిర్చి రైతు విలవిల

● రోజు రోజుకు ధర తగ్గుతుండడంతో ఆందోళన

హుజూరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం మిర్చి ధర ఎక్కువగా ఉండడంతో ఈ సారి మెట్ట ప్రాంత రైతులు మిర్చి పంటను సాగు చేశారు. రోజు రోజుకు వరంగల్ మార్కెట్‌లో ధర తగ్గుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. డివిజన్‌లో 1.10 లక్షల ఎకరాల్లో రైతులు వ్యవసాయం చేస్తున్నారు. అందులో 90వేల ఎకరాల వరకు వరి, 10వేల ఎకరాల్లో మొక్కజొన్న, పత్తితో పాటు ఇతర పంటలను సాగు చేస్తారు. సైదాపూర్, హుజూరాబాద్, శంకరపట్నం, ఇల్లందకుంట మండలాల్లోని కొంత భాగం మెట్ట ప్రాంతం ఉండడంతో అక్కడి రైతులు మిర్చి పంటను సుమారు 150ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మిర్చి క్వింటాల్‌కు గత సంవత్సరం 18 వేల రూపాయల ధర పలికింది. దీనిని చూసిన కొంత మంది రైతులు మిర్చిని సాగు చేస్తున్నారు. మిర్చి పంటకు పెట్టుబడి బాగా అవసరం ఉంటుందని రైతులు అంటున్నారు. మొక్క నాటినప్పటి నుంచి కాయ దశ వరకు వారానికి ఒకసారి పురుగు మందులను పిచికారి చేయాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం మిర్చి పంట చేతికందే సమయంలో దరలు తగ్గుతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. 15 రోజుల క్రితం వరకు వరంగల్ మార్కెట్‌లో క్వింటాల్ మిర్చికి 17 వేల రూపాయల వరకు ధర పలికింది. వారం రోజులుగా 14 వేల నుంచి 14,500 రూపాయలకు పడిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



హుజూరాబాద్ మండలం కాట్రపల్లి శివారులో సాగు చేస్తున్న మిర్చి పంట

పోరు కన్నా ఊరు మిన్న..

మన ఊరుకు తిరిగి రండి

● అజ్ఞాత మావోయిస్టులకు ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపు

సిరిసిల్ల క్రైం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): 'పోరు కన్నా ఊరు మిన్న.. మన ఊరుకు తిరిగి రండి' అంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అజ్ఞాత మవోయిస్టులకు పిలుపునిచ్చారు. జిల్లాలోని అజ్ఞాత మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులను కలిసి విన్నవించేందుకు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లాలోని తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లిలోని అజ్ఞాత నక్సలైట్, మావోయిస్టు కేంద్రకమిటీ ప్రతినిధి కడారి సత్యనారాయణరెడ్డి ఇంటికి ఎస్పీ వెళ్లారు. మావోయిస్టు సత్యనారాయణరెడ్డి కుటుంబసభ్యులను కలిసి పండ్లు అందజేశారు. అజ్ఞాతంలో ఉన్న సత్యనారాయణరెడ్డి జనజీవన స్రవంతిలో కలవాలని చెప్పారు. సరెండర్ ద్వారా ప్రభుత్వం అందించే పునరావాసం, ఇతర సదుపాయాలను కుటుంబసభ్యులకు వివరించారు. అంతకుముందు జిల్లా పోలీసు కార్యాలయంలో కౌన్సెలింగ్ సెషన్ ఏర్పాటు చేశారు. ఇటీవల సరెండరైన మాజీ మావోయిస్టు నేరేళ్ల జ్యోతి అలియాస్ జ్యోతక్కను కార్యాలయానికి పిలిచి ప్రభుత్వం అందించే పునరావాసం, ఇతర సదుపాయాలపై చర్చించారు. అధికారులతో చర్చించి పరిష్కరించనున్నట్లు హామీ ఇచ్చారు.

అటవీ భూములు అన్యాక్రాంతం

● సాగు పేరుతో కబ్జా
● చెట్లను నరికేసి విద్యుత్ స్తంభాల ఏర్పాటు
● చర్యలు తీసుకోని అధికారులు



రంగరావుపేట శివారులో చదును చేసిన అటవీ భూమి

మెట్‌పల్లి రూరల్, జనవరి, 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అటవీ సంపద కనుమరుగవుతోంది. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఏళ్లతరబడి రైతులకు భూ యాజమాన్య హక్కుల్లో స్పష్టత లేక యథేచ్ఛగా భూముల కబ్జాకు పాల్పడుతున్నారు. గ్రామాల శివారులో చెట్లను నరికేసి సాగు చేసుకుంటున్నా అవి అటవీ, రెవెన్యూశాఖలోనివని అధికారులకు స్పష్టత లేకపోవడం గమనార్హం. దీంతో గ్రామాల్లోని అక్రమదారుల వేటుకు అడవులు కనుమరుగవుతున్నాయి. కబ్జాలను తొలగించిన అధికారులు వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోకపోవడంతో ఆక్రమణలకు అడ్డుకట్ట పడటం లేదు.

మండలంలోని రంగరావుపేట బీట్ పరిధిలోని ఆత్మకూర్, ఆత్మనగర్, రామలచ్చక్కపేట, కేసీఆర్‌తండా, పాటిమీదతండా గ్రామాల శివారులో పలువురు అటవీ భూముల అక్రమణకు పాల్పడుతున్నారు. అన్ని వ్యవసాయ భూములుగా మారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో జేసీబీ, బ్లేడ్ ట్రాక్టర్ల సహాయంతో రాత్రికి రాత్రే భూములను చదును చేస్తున్నారు. వాటిని కొందరు సాగు చేస్తున్నా, మరి కొందరు గిరిజనులకు భవిష్యత్‌లో ప్రభుత్వం పట్టాలు ఇస్తుందని మభ్యపెడుతూ ఏకంగా అమ్మకాలు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఎవరైనా ఫిర్యాదులు చేసినప్పుడు మాత్రమే అధికారులు పర్యవేక్షిస్తూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల ఓ ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ ఏసీబీకి చిక్కడమే దీనికి ఉదాహరణ. గత ప్రభుత్వ కాలంలో పోడు భూములకు పట్టాలు ఇవ్వడానికి చర్యలు తీసుకున్నందున ఆక్రమణదారులు అటవీ భూములను కబ్జా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఆత్మకూర్, ఆత్మనగర్ గ్రామస్థులు జిల్లా అధికారులకు ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో అటవీ, ట్రాన్స్‌కో శాఖ అధికారులు పర్యటించి కబ్జా చేసిన భూమిలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను తొలగించారు. కానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో భూములు కబ్జా పాలవుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పాటిమీదితండా అటవీ భూమిలో అక్రమంగా ఏర్పాటు చేసిన కరెంట్ స్తంభాన్ని తొలగిస్తున్న ట్రాన్స్‌కో, అటవీ అధికారులు

● సాగుకు విద్యుత్ స్తంభాల ఏర్పాటు..

మండలంలోని ఆత్మకూర్, పాటిమీదతండా గ్రామాల శివారులోని అటవీ భూముల్లో కొందరు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆత్మకూర్, పాటిమీదితండా, ఆత్మనగర్ శివారుల్లోని అటవీ భూములను ఆనుకొని కొన్ని సర్వే నంబర్లలో ప్రభుత్వ అసైన్డ్ భూములను పేదలకు కేటాయించింది. దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు అటవీ భూముల్లోకి చొరబడి ఆక్రమిస్తున్నారు. వీటి మధ్య రెవెన్యూ, అటవీ శాఖల మధ్య హద్దుల స్పష్టత లేదు. సుమారు వందల హెక్టార్లకు పైగా ఆక్రమించినట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు.

అడవిలో చెట్లను నరికేసిన కబ్జాదారులు...

మండలంలో అటవీ ప్రాంతం ఎక్కువగా విస్తరించి ఉంది. రంగరావుపేట, ఆత్మకూర్ కంపార్ట్‌మెంట్ 611/13 పరిధిలో అటవీశాఖ లెక్కల ప్రకారం 2926.47 హెక్టార్లలో అటవీ భూమి విస్తరించి ఉంది. ఇప్పటికే పోడు భూముల పేరిట వేలాది ఎకరాల అటవీ భూమి ఆక్రమణకు గురి కాగా, కొందరు కలప కోసం, మొరం కోసం అక్రమ వ్యాపారస్థులు గుట్టల్లో తవ్వకాలు చేపట్టడంతో అటవీ సంపద తరిగిపోతూ వచ్చింది. రంగరావుపేట పరిధిలో కొందరు జేసీబీ, ట్రాక్టర్లతో చదును చేసి కబ్జాకు పాల్పడుతున్నారు. వాటిని అమాయకులైన గిరిజనులకు మభ్యపెట్టి ఎకరానికి రూ. 3లక్షల నుంచి 6లక్షల వరకు విక్రయాలు చేస్తూ ప్రభుత్వ ఆస్తిని కొల్లగొట్టుతున్నారు.



పాటిమీదితండా శివారులో చదును చేసిన భూమిని పరిశీలిస్తున్న అటవీ అధికారులు

కొండగట్టు ఈవోగా శ్రీకాంత్‌రావు

● నాలుగు రోజుల క్రితం వేములవాడ ఈవోగా బాధ్యతలు



శ్రీకాంత్‌రావు

మల్యాల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కొండ గట్టు అంజనేయస్వామి దేవస్థానం ఈవోగా వరంగల్ దేవాదాయశాఖలో డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న టి.శ్రీకాంత్‌రావును నియమిస్తూ మంగళవారం దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కె.జ్యోతి ఉత్తర్వులు జారీ చేశారు. కొండగట్టు ఈవో రామకృష్ణారావు సికింద్రాబాద్‌లోని గణేశ్ ఆలయానికి బదిలీ కాగా ఆయన స్థానంలో వేములవాడ ఈవో వినోద్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ నాలుగు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు వేములవాడ ఈవో వినోద్ బాధ్యతలు చేపట్టారు. వినోద్ బాధ్యతలు చేపట్టి నాలుగు రోజులు గడవక ముందే మళ్లీ శ్రీకాంత్‌రావును ప్రభుత్వ ఉత్వర్వుల మేరకు దేవాదాయశాఖ అధికారులు కొండగట్టు ఈవోగా నియమించారు.

కరీంనగర్‌లో టెక్నికల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు బండి సంజయ్ వినతి

కరీంనగర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో టెక్నికల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. మంగళవారం ఢిల్లీలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పాటు, మరో కేంద్ర మంత్రి గజేంద్ర షేకావత్‌ను కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించేందుకు పీఎంశ్రీ పథకం కింద కరీంనగర్ జిల్లాలో ఎంపిక చేసిన 24 ప్రభుత్వ పాఠశాలలు, సిరి సిల్ల జిల్లాలో 16పాఠశా లల్లో ప్రతి పాఠశాలకు 40 లక్షల రూపాయల చొప్పున నిధులు అందించాలన్నారు. నాణ్యమైన విద్యను అందించేందకు అవసర మైన కేంద్ర ప్రభుత్వ సహకారం అందిస్తామని మంత్రి వెల్లడించారు.

● పీవీ గడ్డపై నవోదయ విద్యాలయం

పీవి నర్సింహారావు పుట్టిన గడ్డ వంగరలో నవోదయ విద్యాలయాన్ని కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో నవోదయ విద్యాలయ ఏర్పాటు చేయాలని భావిస్తోందన్నారు. న్యూఢిల్లీలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌ను కలిసి వినతి పత్రం అందించారు. తెలంగాణలో కొత్తగా ఏర్పడిన 18 జిల్లాల్లో నవోదయ విద్యాలయాలు స్థాపించాలని రాష్ట్రం కోరిందన్నారు.



కేంద్రమంత్రికి వినతిపత్రం ఇస్తున్న బండి సంజయ్

సంక్రాంతికి ఆర్టీసీ అదనపు బస్సులు

భగత్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు కరీంనగర్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13వ తేదీ వరకు జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు 770 బస్సులు, 16 నుంచి 22వ తేదీ వరకు 970 అదనపు బస్సులు నడిపిస్తున్నామన్నారు. ప్రయాణికులు ఈ అదనపు బస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం సూచించారు.

జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు..		కరీంనగర్ నుంచి జేబీఎస్‌కు	
తేదీ	బస్సులు	తేదీ	బస్సులు
7వ తేదీ	35	16న	180
8న	35	17న	145
9న	40	18న	145
10న	165	19న	190
11న	165	20న	150
12న	165	21న	80
13న	165	22న	80
మొత్తం	770	మొత్తం	970

డిజిటల్ ఇండియా వైపు దూసుకుపోతున్న భారత్

● ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ తర్వాత భారతదేశం డిజిటల్ ఇండియా వైపు శరవేగంగా దూసుకుపోతోందని, దానిలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ పాత్ర కీలకమని శాతవాహన యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య ఉమేష్ కుమార్ అన్నారు. కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ చాలెంజర్స్ ఇన్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 140 పరిశోధన పత్రాల వీసీ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశంలో డిజిటల్ చెల్లింపులు పెరిగాయన్నారు. ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ అధ్యాపకులు పరిశోధన పట్ల ఆసక్తి పెంచుకుంటూ విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. జాతీయ సదస్సు వైస్ చైర్మన్ టి రాజయ్య మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి జాతీయ సదస్సుకు పరిశోధన పత్రాలు వచ్చినట్లు వీటిని అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురించనున్నట్లు తెలిపారు. సదస్సు నిర్వహణ కార్యదర్శి డాక్టర్ ఎం మల్లారెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా 180 మంది ఔత్సాహిక పరిశోధకులు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ వాణిజ్య, వ్యాపార రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, బ్లాక్ చైన్ టెక్నాలజీస్ ఉపయోగించి వ్యాపార కార్యకలాపాలను సులభంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగం ప్రొఫెసర్ ప్యాట్రిక్ ఆంథోనీ మాట్లాడుతూ ఈ కామర్స్‌లోని అధునాతన పోకడలు, సవాళ్లను వివరించారు. శాతవాహన విశ్వవిద్యాలయ కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగ ప్రిన్సిపాల్ డాక్టర్ డీ హరికాంత్ మాట్లాడుతూ బీమా రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీని ఉపయోగించి బీమా క్లైములు ఏ విధంగా పరిష్కరిస్తున్నారో తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ పి.నితిన్, టి.రాజయ్య, అటానమస్ సమన్వయకర్త డాక్టర్ వి శ్రీనివాస్, అధ్యాపకులు డాక్టర్ ఆర్ రామకృష్ణ, డాక్టర్ ఎం శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ హర్జోత్‌కౌర్ పాల్గొన్నారు.

నలిమెల భాస్కర్‌కు పీవీఎన్ఆర్ స్మారక పురస్కారం

కరీంనగర్ కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పీవీ నరసింహారావు మెమోరియల్ ఫౌండేషన్ వారి పీవీఎన్ఆర్ స్మారక పురస్కారాన్ని మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో డాక్టర్ నలిమెల భాస్కర్ అందుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ చేతుల మీదుగా నలిమెల భాస్కర్‌కు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా భాస్కర్-సావిత్రి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పీవీ తనయుడు ప్రభాకరరావు మాట్లాడుతూ భారతరత్న, మాజీ ప్రధాని పీవీ నరసింహారావును పోలిన బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ అని ప్రశంసించారు. కార్యక్రమంలో పీవీ సోదరుడు రామేశ్వరరావు, శరత్‌బాబు, అన్నవరం దేవేందర్, నగునూరి శేఖర్, పొన్నం రవిచంద్ర, గాజోజు నాగభూషణం, బూర్ల వేంకటేశ్వర్లు, వేముల సత్యనారాయణ, నంది శ్రీనివాస్ పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న నలిమెల భాస్కర్



హుండీ లెక్కిస్తున్న భక్తులు

రాజన్న ఆలయ హుండీ లెక్కింపు

వేములవాడ కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి హుండీ ద్వారా రూ.1.28 కోట్ల ఆదాయం లభించింది. దేవస్థానం హుండీలను మంగళవారం ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో అధికారులు, సిబ్బంది లెక్కించారు. గత ఏడు రోజులకుగాను ఆలయ ఖజానాకు రూ.కోటి 28 లక్షల 78 వేల 106 నగదు సమకూరినట్లు, 305 గ్రాముల బంగారం, 8 కిలోల 200 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఏసీ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ, ఎస్పీఎఫ్ అధికారి కరణ్‌సింగ్ పర్యవేక్షించారు.

మల్కపేట రిజర్వాయర్‌కు నీటి విడుదల



మల్కపేట రిజర్వాయర్‌లోకి చేరుతున్న నీరు

కోనరావుపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు మల్కపేట రిజర్వాయర్‌లోకి నీటిని నింపే ప్రక్రియ మంగళవారం ప్రారంభించారు. కోనరావుపేట మండలం మల్కపేట గ్రామ శివారులో మూడు టీఎంసీల మల్కపేట రిజర్వాయర్ ను ఈ మధ్యనే పనులు పూర్తి చేసి ఒక టీఎంసీ గతంలో నీరు నింపారు. వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి రైతులు తీసుకపోవడంతో స్పందించిన ఆయన ఒక టీఎంసీ నీరు నింపేందుకు ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు ఎత్తిపోతల ద్వారా భారీ మోటార్లను ప్రారంభించి నీటిని రిజర్వాయర్‌లో ఎత్తిపోస్తున్నారు. రిజర్వాయర్‌లో నీటిని నింపుతుండడంతో మండలవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చేపల మార్కెట్ లేక ఇబ్బందులు

● రాజీవ్ రహదారికి ఇరు వైపులా విక్రయం
● వాహనాలు రోడ్డుపై నిలుపుతుండడంతో ప్రమాదాలు

తిమ్మాపూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): దిగువ మానేరు జలాశయం పరిసరాల్లో మత్స్యకారులు చేపలు పట్టుకొని విక్రయించి కుటుంబాలను పోషించుకుంటారు. పట్టిన చేపలు అమ్మేందుకు మార్కెట్ లేక మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలుగునూర్ శివారులో రాజీవ్ రహదారిని ఆనుకొని వంద వరకు గంగపుత్రుల కుటుంబాలు ఉన్నాయి. వీరు పూర్తిగా చేపల వేటపై ఆధారపడి జీవిస్తుంటారు. దిగువ మానేరు జలాశయంతో పాటు కాకతీయ కాలువలో ఇక్కడి మత్స్యకారులు చేపలు పడుతుంటారు. తాజాగా లభించే ఇక్కడి చేపలకు మంచి డిమాండ్ ఉంది. వాటిని అమ్ముకునేందుకు మార్కెట్ లేక మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ఇంటి వద్దనే చేపలను విక్రయిస్తుండగా, మరి కొందరు కరీంనగర్‌లోని మార్కెట్‌కు వెళ్లి చేపలను అమ్ముకుంటున్నారు. ఇంకొందరు రాజీవ్ రహదారి పక్కల దుకాణాలు పెట్టుకుని చేపలు అమ్ముకుంటారు. కొనుగోలు దారులు రోడ్డుకు పక్కన వాహనాలు నిలపడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుపై అతివేగంగా వచ్చే వాహనాలు చేపల విక్రయాలు చేస్తున్న వారిపై దూసుకువెళ్ళిన సంఘటనలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో చేపల మార్కెట్ ఏర్పాటుకు ఒకటి రెండు చోట్ల స్థలాన్ని పరిశీలించినా అది కార్యరూపం దాల్చలేదు. పాలకులు ఇచ్చిన హమీలు కూడా నెరవేరలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.



రాజీవ్ రహదారి పక్కన చేపలు విక్రయించేందుకు ఏర్పాటు చేసుకున్న గొడుగు

రాజీవ్ రహదారి రోడ్డు పక్కన చేపల విక్రయాల కోసం ఏర్పాటు చేసుకున్న గుడిసె

చేపల మార్కెట్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది

- భాగ్య, చేపల కాలనీ, అలుగునూర్



చేపలు అమ్ముకునేందుకు ఇబ్బంది పడుతున్నాం. రోడ్డు పక్కన ఎండలో కూర్చుని అమ్ముకుంటున్నాం. కరీంనగర్‌కు పోతే ధర గిట్టు బాటు కాదు. ఆటో ఖర్చులు, మార్కెట్‌లో కూర్చేనెందుకు స్థలం లేక ఇబ్బందిగా ఉంటుంది. రోడ్డు పక్కన కూర్చొంటే వచ్చే పోయేటోళ్లు ఆగి చేపలను కొంటారు. ఇక్కడ అందరికి కలిపి ఒక చేపల మార్కెట్ ఉంటే బాగుంటుంది.

చేపలు అమ్మడం ఇబ్బందిగా ఉంది..

- కనకయ్య, మత్స్యకారుడు, చేపల కాలనీ, అలుగునూర్



తెల్లవారి లేచి వేటకు వెళ్లి చేపలు పట్టుకువచ్చే దానికన్నా వాటిని విక్రయిండం ఇబ్బందిగా ఉంది. రోడ్డు పక్కన చెట్ల నీడలో కూర్చుని చేపలు అమ్ముకుంటున్నాం. అందరికీ అనువైన స్థలంలో చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

వార్డు ఆఫీసర్ విధులకు ఆటంకం

● కేసు నమోదు

కరీంనగర్ క్రైం జనవరి7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వార్డు ఆఫీసర్‌గా పనిచేస్తున్న అనూష విధులను ఆటంకపరిచి, ఆమె సెల్‌ఫోన్‌ను ధ్వంసం చేసిన కరీంనగర్ మారుతినగర్‌కు చెందిన తిరుమలా కరుణాకర్‌పై కేసు నమోదు చేశామని మూడో ఠాణా పోలీసులు తెలిపారు. మంగళవారం మారుతీనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే విధులు నిర్వహిస్తున్న అనూష ఫొటో తీసుకుని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తుండగా కరుణాకర్ అనే వ్యక్తి ఆమె వద్దకు వచ్చి దూషిస్తూ ఫొటోలు ఎందుకు తీసుకుంటున్నావంటూ ఆటంకం కలగించాడని తెలిపారు.

అనంతరం అనూష వద్ద ఉన్న 25 వేల విలువైన సెల్‌ఫోన్‌ను బలవంతంగా లాక్కుని ధ్వంసం చేశాడని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

కరీంనగర్ క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల శివారులో పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన గర్రెపల్లికి చెందిన సంపంగి రవిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రవిని కానిస్టేబుల్ అడ్డుకున్నాడన్నారు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్‌పై విచారణ జరపాలి



జ్యోతిబాపూలే గురుకులం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గణేశ్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శర్మనగర్ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌పై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగరపు రజనీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరవింద్, శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి హేమంత్, ఎస్ఎఫ్ఐ నాయకులు వినయ్, రాకేష్, సందేశ్, అశోక్ పాల్గొన్నారు.

● బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

గణేశ్‌నగర్/భగత్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్‌పై విచారణ చేపట్టాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రవి డిమాండ్ చేశారు. మంగళవారం యుఎస్ ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ హాస్టళ్లలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మెనూ పాటించ కుండా వార్డెన్లు నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నారన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవా లని హెచ్చరించారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్ విద్యార్థులను ఐక్యం చేసి చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అన్నారు. సమావేశంలో సంపత్ అబిలాష్, రాజకుమార్, అభి, కుమార్ పాల్గొన్నారు.

● అధికారులను సస్పెండ్ చేయాలి

గణేశ్‌నగర్: హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్‌కు బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పూసల విష్ణు డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని శర్మనగర్ కాలనీలో జరిగిన ఘటనపై విచారణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ రసూరి ప్రవీణ్, నగర కార్యదర్శి బామండల నందు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అన్నాడు శ్రీవర్ధన్,గోసుకుల విగ్నేష్, జోనల్ ఇన్చార్జులు విష్ణు, అనిల్, యోగేష్, సంయుక్త కార్యదర్శి ప్రశాంత్, ఆకాష్, రఫీ, సాయి పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌ను తొలగించాలి

గణేశ్‌నగర్: నగరంలోని శర్మనగర్‌లో విద్యార్థుల ఫుడ్ పాయిజన్ ఘటనలో ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవా లని కలెక్టర్‌కు పొన్నం అనిల్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు వినతిపత్రం సమర్పించారు. గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులను అడిగి విషయాలు తెలుసు కున్నారు. కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ ఇన్చార్జి చుక్క శ్రీనివాస్, బొంకూరి మోహన్, ఆరే రవి గౌడ్, నారదాసు వసంత్ , నరేష్ రెడ్డి, పర్శరాం, సతీష్, వొడ్నాల రాజు, జెల్లోజీ శ్రీనివాస్, నదీం, అన్వేష్, మహేష్, మల్లేష్, జావేద్, సోహేల్, మనిదీప్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

4,933మంది రైతులకు రుణమాఫీ

-మండల వ్యవసాయ అధికారి సత్యం


ఫటాఫట్

ప్రశ్న: మండలంలో ఎంత మంది రైతులకు పంట రుణ మాఫీ అయ్యింది?

జవాబు: మండలంలో మొత్తం 4,933 మంది రైతులకు 34.92 కోట్ల రూపాయలు లబ్ధి చేకూరింది.

ప్రశ్న: మండ లంలో యాసంగి సాగు విస్తీర్ణం ఎంత?

జవాబు: యాసం గిలో కరీంనగర్ మండలంలో మొత్తం 13,552 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు అంచనా వేశాము.

ప్రశ్న: రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయా?

జవాబు: ప్రస్తుతం యాసంగికి సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచాము. యూరియా 924 టన్నులు, డీఏపీ 678 టన్నులు, పోటాష్ 339 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 1016 టన్నులు అవసరం ఉంటుందని అంచనా వేశాము.

ప్రశ్న: రైతు భరోసా ఎప్పుడు ప్రారంభం అవుతుంది?

జవాబు: రైతు భరోసా ఈ నెల 26 నుంచి ప్రారంభం అవుతుంది. ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. పంట నమోదు ఆధారంగా సాగులో ఉన్న భూమికి మాత్రమే రైతు భరోసా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

-కరీంనగర్ రూరల్

డీసీసీ అధికార ప్రతినిధిగా స్వామి

కరీంనగర్ అర్బన్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా గాదం స్వామిని నియామిస్తూ డీసీసీ అధ్యక్షులు, మానకొండూర్ శాసనసభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.

● అవీ.. ఇవీ

●కరీంనగర్ టౌన్: రీజనల్ ప్రావిడెంట్ హయ్యర్ పెన్షన్ త్వరగా అమలు చేయాలని టీఎస్ఆర్టీసీ రిటైర్మెంట్ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షుడు వంగ వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు సోమవారం అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

●విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (వోపా) ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలతో పాటు వ్యాసరచన పోటీలు నిర్వహిసున్నట్లు వోపా అధ్యక్షుడు గద్దె తిరుమల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌చారి ప్రకటనలో తెలిపారు.

●సుభాష్‌నగర్: టీఎన్‌జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్‌హుస్సేని ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో జిల్లా టీఎన్‌జీవో నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావు పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్‌పై పంచాయతీ సిబ్బంది కొరడా

కరీంనగర్ రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ గ్రామ శివారులో అనుమతి లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసి లేఅవుట్ పై గ్రామ పంచాయతీ అధికారులు కొరడా ఝులిపించారు. గ్రామ శివారులో సర్వే నెంబర్ 362లో ఎలాంటి అనుమతులు లేకుండా లే అవుట్ చేసి స్థలాలను అమ్మేందుకు ఖనిలను ఏర్పాటు చేశారు. అనుమతులు లేకుండా అక్రమంగా స్థలాలను విక్రయిస్తున్నారని కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల అధికారులు అప్రమత్తం అయ్యారు. వెంటనే అక్రమంగా అనుమతి లేకుండా లే అవుట్‌లు చేసిన స్థలాలపై అధికారులు చర్యలు చేపట్టారు. 363 సర్వే నెంబర్‌లో వెంచర్ వేయగా ఎలాంటి అనుమతులు లేవని నిర్ధారించుకున్న ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు.

దీంతో గ్రామ పంచాయతీ సిబ్బంది మంగళవారం తొలగించారు. ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా స్థలాలు అమ్మిన లే అవుట్‌లు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని మండల అధికారులు తెలిపారు.

లక్ష మంది పాడి రైతుల సంస్థ కరీంనగర్ డెయిరీ

- రాష్ట్రంలోనే నంబర్‌వన్ స్థానం - కెంఎంపిసిఎల్ చైర్మన్ చలిమెడ రాజేశ్వర్‌రావు



మాట్లాడుతున్న కెఎంపిసిఎల్ చైర్మన్ చలిమెడ రాజేశ్వర్‌రావు

కరీంనగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): లక్ష మంది రైతు కుటుంబాల సంస్థ కరీంనగర్ డెయిరీ అని కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్(కెఎంపిసిఎల్) ఛైర్మన్ చలిమెడ రాజేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం కరీంనగర్ డెయిరీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ డెయిరీలో అనేక మార్పులు తెచ్చి 55కు పైగా సంక్షేమ పథకాలు అమలుచేసి రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టామన్నారు. 1971లో కరీంనగర్ డెయిరీ స్థాపన జరిగిందన్నారు. నేడు రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉన్నామన్నారు. ప్రస్తుతం 1.80 లక్షల లీటర్ల పాల సేకరణ జరుగు తుందన్నారు. 1.04 లక్షల లీటర్ల పాలు విక్రయాలు చేస్తు, 40 వేల లీటర్లతో ప్రొడక్టులు తయారు చేస్తున్నామన్నారు. 30 వేల లీటర్లను పౌడర్ తయారీకి చిత్తూరుకు పంపాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ మధ్య ప్రభుత్వం మొక్క విజయ డెయిరీ నెయ్యినే దేవాలయాలు, పాఠశాలల్లో వాడాలని తీసుకున్న నిర్ణయంతో కొంత మేర పాలు మిగులుతున్నాయన్నారు. లక్ష మంది రైతు కుటుంబాలకు సంబంధించిన డెయిరీని దెబ్బతీయడానికి కొన్ని కుట్రలు జరుగుతున్నట్లుగా ఈ మధ్య జరుగుతున్న పరిణామాల బట్టి అర్థమవుతోందన్నారు. రైతుల కోరిక మేరకు నిజానిజాలను వివరించే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

డెయిరీపై కొంత మంది పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఫిర్యాదు చేశారని రాజేశ్వర్‌రావు అన్నారు. డెయిరీ వల్ల చుట్టు పక్కల ప్రాంతాలు దెబ్బతింటున్నాయని, కెమికల్స్ కలుపుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. చట్టబద్ధమైన సంస్థలకు ఫిర్యాదు చేసుకునే హక్కు ఎవరికైనా ఉంటుందన్నారు. ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత అధికారులు వస్తే మేము తీసుకుంటున్న జాగ్రత్తలను వివరిస్తామన్నారు. అసత్య ప్రచారాలతో సేల్స్ తగ్గితే దాని ప్రభావం రైతు కుటుంబాలపై పడుతుందన్నారు. వినియోగదారులు తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ఆయన కోరారు.

విద్యార్థినులకు పరామర్శ

కరీంనగర్ అర్బన్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే గురుకులంలో అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన విద్యార్థినులను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మంగళ వారం పరామర్శించారు. సుడా చైర్మన్ వెంట కాంగ్రెస్‌పార్టీ నాయకులు తాజొద్దిన్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, మెరాజ్, అశ్రాఫ్, బషీర్, మామిడి సత్యనారాయణరెడ్డి, నదీమ్, ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

●గణేశ్‌నగర్: బీసీ హాస్టల్ విద్యార్థినులను జిల్లా బీసీ సంఘం నాయకులు ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెసిపెద్ది శ్రీధర్ రాజు, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్,సిరిపెట్టి రజేష్‌గౌడ్ తదితారులు పాల్గొన్నారు.

కవి ఖాలిద్‌కు కలెక్టర్ అభినందన

కరీంనగర్ కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్‌గా జీవనోపాధి పొందుతూ పలు అంశాలపై కవిత్వం రాస్తున్న ఎండి ఖాలిద్‌ను కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. ఖాలిద్ తాను ఇటీవల ఆవిష్కరించిన 'మనమంతా ఒక్కటే' పుస్తకాన్ని కలెక్టర్‌కు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

'బాధ్యులను అరెస్టు చేయాలి'

భగత్‌నగర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడికి పాల్పడిన కాంగ్రెస్ గుండాలను వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గుండాగిరి మొదలు పెట్టిందన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కాంగ్రెస్ పార్టీ విస్మరించిందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై రాళ్లు కోడిగుడ్లతో దాడులు చేయడం దారుణమన్నారు.

సంక్రాంతికి అందని రేషన్ బియ్యం

(5వ పేజీ తరువాయి)

4న ఒప్పందం కుదిరిదింది. ఈ ఒప్పందంపై పౌరసరఫరాలశాఖ కమిషనర్ సంతకం చేశారు. ఒప్పందం కుదిరిన 10 రోజుల్లోనే జీవో విడుదల చేస్తామని హామీ ఇచ్చి నాలుగు నెలలు అయినా జీవో రాక పోవడంతో హమాలీలు మళ్లీ అందోళన బాటపట్టారు. డిసెంబరు 18న నోటీసు ఇచ్చినా పౌరసరఫరాలశాఖ నుంచి స్పందన రాకపోవడంతో జనవరి 1 నుంచి సమ్మె చేస్తున్నారు. దీంతో రేషన్‌షాపులకు బియ్యం సరఫరా నిలిచిపోయింది. హమాలీలు సమ్మె నోటీసు ఇచ్చినా అధికారులు ముందస్తుగా డీలర్ల నుంచి డీడీలు తెప్పించుకోక పోవడంతోనే పండుగ పూట ప్రజలు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): నగరంలో, రూరల్ ప్రాంతంలో విద్యుత్ మరమ్మతులో భాగంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ -1, రూరల్ ఏడీఈలు పంజాల శ్రీనివాస్ గౌడ్, గాదం రఘులు తెలిపారు. శివ థియేటర్ ప్రాంతం, కోర్టు వెనుక వైపు ప్రాంతం, జ్యోతినగర్ ప్రాంతం, వెంకటేశ్వర ఆలయం ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్, కొత్తపల్లి రూరల్ ప్రాంతంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఖాజీపూర్ గ్రామం, గ్రానైట్ పరిశ్రమల ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

శబరిమలలో లడ్డూల వితరణ


లడ్డూలను తయారు చేస్తున్న మహిళలు

కరీంనగర్ కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన అయ్యప్ప అన్నదాన సేవాసమితి బాధ్యుడు పోలు సత్యనారాయణ (విద్యార్థి గురుస్వామి) శబరిమలలో క్వింటాల్ లడ్డూ వితరణకు శ్రీకారం చుట్టారు. 2005 నుంచి అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. 2015 వరకు సన్నిధానంలో సుమారు 25 వేల మంది దీక్షాపరులకు అన్నప్రసాద వితరణ చేశారు. దేవస్థానం బోర్డు అన్నప్రసాద వితరణను నిలిపి వేయడంతో ఈ యేడు క్వింటాల్ లడ్డూ వితరణకు శ్రీకారం చుట్టారు. లడ్డూతో పాటు అల్పాహారం కింద ఖార, అటుకులను ఈ నెల 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు దాదాపు 10 వేల నుంచి 12 వేల మంది దీక్షాపరులకు అందజేసేందుకు మంగళవారం లడ్డూలు, అల్పాహార సామగ్రి తన నివాసంలో సిద్ధం చేశారు.

'పార్కుల్లో ఎంట్రీ ఫీజును రద్దు చేయాలి'

సుభాష్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జ్యోతిబాపూలే, మల్టీపర్పస్ పార్కుల్లో ఎంట్రీ ఫీజును తొలగించాలని హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధనపురి సాగర్ కోరారు. మంగళవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందచేశారు.కార్యక్రమంలో శ్రీనివాస్, కిరణ్, మల్లేశం పాల్గొన్నారు.

50వ డివిజన్‌లో 'ఆరోగ్య మహిళ'

సుభాష్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 50వ డివిజన్‌లో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పోరేటర్ కొలిపాక అంజయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ సాయిరాజ్, డాక్టర్ ప్రణతి పాల్గొన్నారు.

ఒలింపియాడ్ పరీక్షకు నగునూర్ విద్యార్థిని ఎంపిక

కరీంనగర్ రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ స్కూల్‌లో మండల స్థాయి ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలంపియాడ్ పరీక్షలకు 9వ తరగతికి చెందిన పి కీర్తన మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయికి ఎన్నికైంది.

చెకుముకి పోటీల్లో రత్నం గ్లోబల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి చెకుముకి ప్రతిభ పరీక్ష పోటీల్లో జిల్లా కేంద్రంలోని రత్నం గ్లోబల్ స్కూల్ విద్యార్థులు బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మంగళవారం కలెక్టర్ పమేలా సత్పతిని కలవగా ఆమె అభినందించారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఈవో జనార్దన్‌రావు, రత్నం గ్లోబల్ హైస్కూల్ చైర్మన్ రత్నమయ్య, కరస్పాండెంట్ రమేష్, ప్రిన్సిపాల్ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై బీఆర్ఎస్ నాయకుల ధర్నా

చొప్పదండి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పేరిట మాటమార్చి మోసం చేసిందని, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మంగళవారం చొప్పదండిలో రైతు ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలన్నారు. రుణమాఫీ, రైతుభరోసా కోసం రైతులు ఎదురుచూపులు చూస్తున్నారన్నారు.

● గన్నేరువరం: సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలో రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తానని చెప్పి అధికా రంలోకి వచ్చాక కేవలం రూ.12 వేలను మాత్రమే ఇస్తానని అనడం శోచనీయమని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గంప వెంకన్న, మాజీ జడ్పీటీసీ మాడు గుల రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండలశాఖ అధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం గుండ్లపల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా కాలువ సంతోష్‌ను నియమించారు. నాయకులు పుల్లెల లక్ష్మణ్, న్యాత సుధాకర్, గ్రామశాఖ అధ్యక్షుడు మీసాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

● గంగాధర: ఎన్నికల హామీలను విస్మరిస్తూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. గంగాధరలో మంగళవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నవీన్‌రావు, కంకణాల విజేందర్ రెడ్డిలు విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

హుజూరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు భరోసా ప్రకటించడాన్ని హర్షిస్తూ మంగళ వారం కాంగ్రెస్ నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలోనాయకులు మేకల తిరుపతి, కొల్లూరి కిరణ్, ఎండీ అఫ్సర్ పాల్గొన్నారు.

● జమ్మికుంట: కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాల అమలుపై జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టివిక్రమార్క, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్‌రెడ్డి, పాతకాల అనిల్ పాల్గొన్నారు.

గ్యాస్ ప్రమాదాలు జరుగకుండా చూడాలి

హుజూరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ ప్రమాదాలు జరుగకుండా సురక్ష రబ్బరు ట్యూబులు మార్చుకోవాలని తెలంగాణ వంట గ్యాస్ డీలర్ల అధికార ప్రతినిధి వీవీ మదన్‌మోహన్‌రావు అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని అంబుజా గ్యాస్ ఏజెన్సీలో స్టాఫ్, డెలివరీ సిబ్బందికి పునశ్చరణ కార్యక్రమం నిర్వహించారు. మేనేజర్ దేవేందర్‌రెడ్డి, మొండయ్య, రమేష్, పవన్, శరత్, భరత్, సరిత, భరత్‌రెడ్డి, కనకయ్య పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వీణవంక, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఘన్ముక్ల గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశ పరీక్షల ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ మోయిజ్‌బేగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఫిబ్రవరి 28వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 13న పరీక్ష ఉంటుందన్నారు.

కల్వల ప్రాజెక్టుకు నీటి విడుదల

వీణవంక, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కాకతీయ కెనాల్ నుంచి కల్వల ప్రాజెక్టుకు మంగళవారం నీటిని విడుదల చేశారు.

హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఆదేశాల మేరకు నీటిని విడుదల చేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


కాలువలో పారుతున్న నీరు

ప్రజా వైద్యానికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట : కవ్వంపల్లి


ఆసుపత్రి నిర్మాణానికి స్థలపరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా వైద్యానికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తుందని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్‌కు మంజూరైన 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి మంగళవారం మండల కేంద్రంలో స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విద్యతో పాటు వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మండల కేంద్రంలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి పీహెచ్‌సీ పక్కన ఉన్న ఖాళీ స్థలం అనువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, తహశీల్దార్ బి. రాజేశ్వరీ, వైద్యులు చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ అధ్యక్షులు మర్రి ఓదెలు, ఉపాధ్యక్షులు రామిడి తిరుమల్‌రెడ్డి, నందగిరి రవీంద్రాచారి, తాల్లపల్లి సంపత్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి కొత్తకొండ శంకర్, కేంద్ర సురేష్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

తిమ్మాపూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి అన్నారు. మంగళవారం మండలంలోని సెయింట్ ఆంథోనిస్ పాఠశాలలో రోడ్డు ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్టీవో విజయపాల్‌రెడ్డి, ఎంవీఐ రవికుమార్, ఏఎంవీఐ హితయాదవ్, సిబ్బంది శ్రీనివాస్, గౌస్ పాషా, రాంకీ, శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

జమ్మికుంట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం సౌమ్య అన్నారు. మంగళ వారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

తిమ్మాపూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొలంపల్లి, మల్లాపూర్, మన్నెంపల్లి, పోరండ్ల, మక్తపల్లి, లక్ష్మీదేవిపల్లిలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను ఉల్లెంగుల సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకుడు ఉల్లెంగుల ఏకానందం మంగళవారం పరమర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ఉల్లెంగుల సేవా ట్రస్ట్ తరఫున ఆర్థిక సహాయం అందజేశారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


హుజూరాబాద్‌లో స్పీడ్ బ్రేకర్స్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ, పోలీసులు

హుజూరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని సైదాపూర్ మూల మలుపు వద్ద రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఏర్పాటు చేసిన రంబుల్ స్ట్రిప్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐలు తిరుమల్‌గౌడ్, వెంకట్‌గౌడ్, ఎస్ఐ యూనస్ పాల్గొన్నారు.

● చైనా మాంజా అమ్మితే కఠిన చర్యలు

చైనా మాంజ గాలిపటాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని పలు కిరాణం షాపులను తనిఖీ చేశారు. చైనా మాంజలు ఉపయోగించడం వల్ల పక్షులతో పాటు మనుషులకు కూడా ప్రమాదాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ యూనస్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● శంకరపట్నం : గాలిపటాల విక్రయదారులు చైనా మాంజ అమ్మితే కఠిన చర్యలు తప్పవని కేశవపట్నం ఎస్ఐ కొత్తపల్లి రవి అన్నారు. మంగళవారం పలు కిరాణం షాపులను ఆయన తనిఖీ చేశారు.

● రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా కేశవపట్నం బస్టాండ్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై ఎస్సై రవి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

● రోడ్డు భద్రత వారోత్సవాలపై అవగాహన

హుజూరాబాద్ : హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ట్రాలీ ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత వారోత్సవాలపై ఎంవీఐ కంచి వేణు మంగళవారం అవగాహన కల్పించారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు.ఇన్సూరెన్స్, రెన్యువల్, ట్యాక్స్, పొల్యూషన్, రికార్డులు తమ వెంట ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కానిస్టే బుల్ నాగరాజు, హోంగార్డు శ్రీకాంత్ పాల్గొన్నారు.

అవసరమున్న చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

తిమ్మాపూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రధాన కూడళ్ల వద్ద, గ్రామాల్లో అవసరమున్న చోట సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్ సూచించారు. మంగళవారం సాయంత్రం ఆయన ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానికంగా ఉన్న మూడు ఇంజనీరింగ్ కళాశాలల్లో ఈవ్ టీజింగ్, డ్రగ్స్, గంజాయి లాంటి వాటి ఆనవాళ్లు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. క్రైం రేటు తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవల్సిన జాగ్రతలపై పోలీసులకు పలు సూచనాలు చేశారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ సీఐ కర్రె స్వామి, ఎల్ఎండీ ఎస్సై వివేక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం..

● తిమ్మాపూర్: మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు.

● చొప్పదండి: పట్టణంలోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు.

● గంగాధర: మండలంలోని గర్షకుర్తి పాఠశాలకు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రెడ్డి, చిందం ఆంజనేయులు, కత్తి శంకర్‌గౌడ్ 28 వేల విలువైన సౌండ్ సిస్టంను అందజేశారు.

- మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు మాదక ద్రవ్యాల అనర్థాలపై కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ సీఐ అశోక్ కుమార్ అవగాహన కల్పించారు.

● ఇల్లందకుంట: మండలంలోని మర్రివానిపల్లెలో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు.

● జమ్మికుంట రూరల్: మండలంలో మడిపల్లిలో గత నెల 28న ఆకుల కొంరయ్య తన భూమిలోని ఈత చెట్లను తొలగించాడని గీత కార్మికులు తెలిపారు. ఈ విషయంపై ఎక్సైజ్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు.

● ఇల్లందకుంట: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది కుమార్‌ను యూత్ కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్ సన్మానించారు.

● హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో స్నాక్స్ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆంజనేయరావు తెలిపారు.

- హుజూరాబాద్ హైస్కూల్ మైదానంలో హైమాస్ట్ లైట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక ప్రారంభించారు.

● వీణవంక: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల విద్యార్థులకు బైట్ లైఫ్ కో ఆర్డినేటర్ తాళ్లపల్లి కుమారస్వామి కెరీర్ గైడెన్స్, ఉద్యోగ సాధన అంశాలపై అవగాహన కల్పించారు.

- బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని బీజేపీ మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి ఖండించారు.

● గన్నేరువరం: మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా మండలంలోని గోపాల్‌పూర్‌కు చెందిన జెల్ల రాజేశ్వరి నియమితులయ్యారు.

● రామడుగు: కేంద్రం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రభుత్వం పబ్బం గడుపుతోందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పూరెల్ల శ్రీకాంత్‌గౌడ్ విమర్శించారు.